క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



స్వామి చిత్రపటాన్ని, లడ్డూను విజయలక్ష్మికి అందిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్న దానానికి గోగన్నమఠానికి చెందిన సాగి సత్య నారాయణరాజు జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి సాగి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.25వేల విరాళం శనివారం అందించారు. ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ ఎం.కె.టీ.నాగవరప్రసాద్ దాతలకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, కొమ్ముల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మిత్రపురుగులకు హాని కలగకుండా మందుల పిచికారీ

అంబాజీపేట: పొలం పరిసరాల విశ్లేషణ చేసి పురుగు ఉధృతి, మిత్ర పురుగుల నిష్పత్తిని బట్టి పురుగు మందులు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. చిరతపూడిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని సర్పంచ్ కోట బేబిరాణి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విచక్షణ రహితంగా పురుగుల మందులు వినియోగించ వద్దన్నారు. మిత్ర పురుగులను బట్టి ఎరువులు పిచికారీ చేయాలన్నారు. ప్రభుత్వం రాయితీపై కిసాన్ డ్రోన్లు సరఫరా చేస్తుందన్నారు. యూనిట్ ఖరీదులో 50 శాతం బ్యాంకు రుణం, 40 శాతం రాయితీ, 10 శాతం రైతు వాటాగా డ్రోన్‌లు పొందవచ్చన్నారు. కావాల్సిన రైతులు కస్టమ్ హైరింగ్ సెంటర్‌గా ఏర్పడాలన్నారు. ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియాపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఎం.రవితేజ, రైతులు దారపురెడ్డి శ్రీనివాసరావు, కడలి రామకృష్ణ, దార్లంక గోవిందు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వెంకన్న ఆలయాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరు, నర్సిపూడి, గుమ్మిలేరు గ్రామాల్లో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో శనివారం కిక్కిరిశాయి. భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు.

దాతలకు సత్కారం

ఆలమూరు: జొన్నాడలో ఇటీవల అర్చకుల నివాసం ఉండేందుకు సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన భవన నిర్మాణ దాతలను శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సేవలందిస్తున్న అర్చకులకు గ్రామానికి చెందిన గొడవర్తి సత్యనారాయణమూర్తి, పద్మ దంపతులను గ్రామస్తులు సన్మానించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

ఆలమూరు: రబీ సీజన్ తుది దశకు చేరుకున్నందున రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సన్నద్ధం కావాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తులసి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో డీఏఓ కాకి నాగేశ్వరరావుతో కలిసి ఆమె పర్యటించారు. ఆర్‌బీకేలకు సంబంధించి రికార్డులను తనిఖీ చేసి పరికరాలను సిద్ధం చేయాలని కోరారు.

డీజే నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులపై కేసు

అయినవిల్లి: సిరిపల్లెమ్మవారి జాతర సందర్భంగా శుక్రవారం అనుమతుల్లేకుండా డీజే బాక్సులు ఏర్పాటు చేసినట్టు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులపైన, డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేసి వారి, నుంచి బలేరో వ్యాన్, ఏడు డీజే బాక్సులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఏపీ ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్



వీరభద్రారెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న పండితులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారిని ఏపీ ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వీరభద్రారెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు వినాయక రావు, సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. స్వామివారి ఆలయ చరిత్రను వివరించారు.

నూకాలమ్మ.. దయ చూపమ్మా..

- రేపటి నుంచి జాతర, తీర్థోత్సవాలు ప్రారంభం
- అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి
- దర్శించుకోనున్న లక్షలాది మంది భక్తులు

ఆలమూరు: కోరిన కోర్కెలు తీర్చి.. బాలరిష్టాలు నివారించి, ఆరోగ్య ప్రదాయనిగా చింతలూరి వంశస్తుల ఆడపడుచు శ్రీనూకాంబిక అమ్మవారు పేరు గాంచింది. ఏటా ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రాత్రి నుంచి జాతర, తీర్థ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలకు కోస్తా జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సుమారు 30 లక్షల మంది వరకూ స్థానికుల బంధుగణంతో పాటు భక్తులు తరలివస్తారని ఆలయ కమిటీ అంచనా వేస్తోంది. పవిత్ర గౌతమీ గోదావరి తీరాన ఉన్న జిల్లాలోని ఆలమూరు మండలం చింతలూరులో వేంచేసి ఉన్న అమ్మవారి ఆలయానికి రెండున్నర శతాబ్దాల చరిత్ర ఉంది. చింతలూరు గ్రామ శివారు ప్రాంతంలోనున్న పాలచెట్టు తొర్రలో లభించిన అమ్మవారి విగ్రహాన్ని అప్పటి పిఠాపురం మహారాజు సహకారంతో ప్రతిష్ఠించినట్టు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది

ఎక్కడున్నా ఊరికి వచ్చేస్తారు..

అమ్మవారు చంటిపిల్లల పాలిట అమృతవల్లిగా, సకల పాపాలు హరించే మాతృమూర్తిగా విరాజిల్లుతోంది. ఇక్కడ చిన్నారులతో కాగడాలు వెలిగించి వారకల్లు, తుళ్లబిళ్ల దిష్టి తీయిస్తే తట్టు, పొంగు, ఆటలమ్మ వంటి అంటు వ్యాధులు సోకవనేది భక్తుల విశ్వాసం. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తుల బంధుగణం దేశంలో ఎక్కడ ఉన్నా సరే అమ్మవారి జాతరకు వచ్చి వారి పిల్లల చేత కాగడాలు వెలిగించడం ఆనవాయితీ. అమ్మవారిని నెల రోజుల ముందు నుంచే మండలంలోని అన్ని గ్రామాల్లో బుట్టగరగ రూపంలో ఊరేగిస్తారు. ఇప్పటికే అమ్మవారు గరగల రూపంలో ప్రజలకు దర్శనమిచ్చారు.



నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వారం



చింతలూరు నూకాంబిక అమ్మవారు

అధికారులు అప్రమత్తం

అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ భక్తులను మంత్రముగ్ధులను చేస్తుంది. భక్తులు సేదతీరేందుకు వీలుగా గ్రామంలో పలుచోట్ల చలువ పందిళ్లు వేశారు. కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి జాతర, తీర్థోత్సవాలపై ఇప్పటికే రెండుసార్లు సమీక్ష నిర్వహించి, అధికారులను అప్రమత్తం చేశారు. రామచంద్రపురం, రావులపాలెం, రాజమహేంద్రవరం డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

మోదుగుపూల గరగ ప్రత్యేక ఆకర్షణ

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరే ప్రాంతంలో లేని విధంగా నూకాంబిక అమ్మవారి పూల (గరగ) ఘటానికి పక్షం రోజుల ముందునుంచే కొత్త, పాత పూల ఉత్సవాలను నిర్వహిస్తారు. అయితే ఈపూలను రోజు విడిచి రోజు మన్య సీమ ప్రాంతం నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలతో అలంకరిస్తారు. ఈగరగను నెత్తిన ధరించిన నత్య కళాకారుడుచే చంటిపిల్లలను దాటిస్తే ఏవిధమైన రోగాలు దరిచేరవనే విశ్వాసం భక్తుల్లో ప్రగాఢంగా నెలకొంది. ఈనెల20న జరిగే అమ్మవారి జాతర రోజున అబ్బుర పర చే గరగ నత్యాలు, 21న జరిగే తీర్థం రోజున గవ్వ నత్యం, 22న జరిగే ఉగాది నాడు నిర్వహించే ×బద్ది కడుగుట× కార్యక్రమంతో ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.మార్చి 20 నుంచి ప్రారంభమయ్యే జాతర తీర్థోత్సవాలు ఏప్రియల్ 19 వరకూ జరగనున్నాయి. శ్రీనూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా కొత్తపేట డీఎస్పీ కెవి.రమణ ఆధ్వర్యంలో. రావులపాలెం సీఐ ఎస్.రజినీ కుమార్, ఎస్సై ౹౹ ఎస్.శివప్రసాద్ పర్యవేక్షణలో పోలీసుల బృందం బందోబస్తు ఏర్పాట్లు చేస్తుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. క్యూలైన్లు, తాగు నీటి వసతి, చంటి పిల్లలకు పాలు సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. తీర్థంలో అపారిశుధ్యాన్ని తొలగించేందుకు పంచాయతీ ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

–నూకపెయ్యి సూరిబాబు, ఆలయ కమిటీ చైర్మన్, చింతలూరు

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం



అమ్మవారి ఉత్సవాలను ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని పూర్తి పారదర్శకతతో ఉత్సవాలు చేపట్టనున్నాం. ఇప్పటికే ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం.

– ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఈఓ, చింతలూరు

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



అంబాజీపేట సొసైటీలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: యాంత్రీకరణ పద్ధతుల ద్వారా సాగు చేపట్టాలని అందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో మహాజన సమావేశం సొసైటీ చైర్మన్ కొర్లపాటి కోటబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కోటబాబులు మాట్లాడుతూ రైతుల సహకారంతోనే సొసైటీ లాభాల్లో పయనిస్తుందన్నారు. సొసైటీలో రుణాలు తీసుకున్న వారు సకాలంలో రుణాలు చెల్లించేలా బాధ్యతలు తీసుకోవాలన్నారు. కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ద్వారా రైతులు గ్రూపులుగా ఏర్పడితే ప్రభుత్వ సబ్సిడీ రుణాలు పొందవచ్చన్నారు. సొసైటీ సీఈఓ కుంపట్ల అయ్యప్పనాయుడు మాట్లాడుతూ ఏడాది కాలంలో రూ.11 కోట్లతో లావాదేవీలు నిర్వహించామన్నారు. ఇప్పటి వరకూ సొసైటీ సభ్యులు 1161 మంది ఉన్నారన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, వాకపల్లి దొరబాబు, ఎంపీటీసీ మద్దింశెట్టి దొరబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.ఎం.శెట్టి, సూదాబత్తుల రాము, చప్పిడి రాజు, ఏఓ సీహెచ్.డి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూమి రీ సర్వే వేగవంతం చేయాలి

- ఆర్డీఓ ముక్కంటి
- కొత్తపేటలో భూ నిర్ధారణ ప్రక్రియ పరిశీలన

కొత్తపేట: గ్రామాల్లో రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ ఎం.ముక్కంటి రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బందికి సూచించారు. కొత్తపేట గ్రామ రీ సర్వేకు సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న భూమి నిర్ధారణ ప్రక్రియను శనివారం ఆర్డీఓ పరిశీలించారు. గ్రామంలో విస్తీర్ణం, దానిలో ప్రభుత్వ భూమి ఎంత? జిరాయితీ ఎంత? ఇంత వరకూ ఎంత మేర రీ సర్వే పూర్తయ్యింది? అనే వివరాలపై ఆరా తీశారు. మొత్తం 3,454 ఎకరాలు విస్తీర్ణ కాగా 650 ఎకరాలు ప్రభుత్వ భూములు, 2,854 ఎకరాలు పల్లం, మెరక జిరాయితీ భూమిగా గుర్తించినట్టు సర్వే సిబ్బంది తెలిపారు. రీ సర్వే వేగవంతం చేయాలని ఆర్డీఓ సూచించారు. కొలు భూములకు సంబంధించి కొలు రైతులు ద్వారా భూ యజమానులకు సమాచారం ఇచ్చి, ఆ భూముల కార్డులు పంచాయతీలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు భూ యజమానులు తమ భూ సమస్యలకు సంబంధించి అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వాడపాలెం రీ సర్వే పూర్తి కాగా గంటి, అవిడి, మందపల్లి, వానపల్లి ఖండ్రిగ గ్రామాల్లో 5,420 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి సర్వే పూర్తి కాగా గ్రౌండ్ వేలిడేషన్ జరుగుతుందన్నారు. బిళ్లకుర్రు, పలివెల, కొత్తపేట గ్రామాల్లో 8,312 ఎకరాల విస్తీర్ణ కాగా రీ సర్వే ప్రారంభ దశలో ఉందని. ఫీల్డ్ వర్క్ జరుగుతుండగా రైతుల నుంచి డాక్యుమెంట్స్ రావాల్సి ఉందన్నారు. రైతులు తమ భూమికి సంబంధించిన దస్తావేజులు, పట్టాదార్ పాస్‌బుక్, 1 బీ రికార్డు (సచివాలయం లేదా మ సేవ ద్వారా తీసుకోవాలి), ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్‌లకు సంబంధించిన జిరాక్స్‌లను, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్ సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కార్యదర్శి వీవీ రామన్, వీఆర్‌ఓలు కె.వీరేంద్ర, దుర్గ, మహాలక్ష్మి, సుభాషిణి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపేటలో రీ సర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

రాష్ట్ర స్థాయి పోటీలకు పునీత్ ఎంపిక

అంబాజీపేట: ఈ నెల 24వ తేదీన విజయవాడలో జరగబోయే పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం రాష్ట్రస్థాయి పోటీలకు గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గుబ్బల పునీత్ ఎంపికైనట్టు హెచ్ఎం ఎంఎస్ఎస్ కుమారి తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో పునీత్‌ను పలువురు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ఈ నెల 17న జరిగిన పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో రెంట్ ఫర్ కిచెన్ కుక్ యువర్ ఫుడ్ ప్రాజెక్ట్‌లో పునీత్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి చేతుల మీదుగా పునీత్, గైడ్ టీచర్ ఎంఎస్ఎస్ కుమారి, ఎంఆర్పీ అప్పారి శశికుమార్ ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పునీత్‌ను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.ఎం.శెట్టి, పీఎంసీ చైర్మన్ ఎం.సూర్యనారాయణ, స్థానిక పెద్దలు రాయుడు షణ్ముఖ్, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, తదితరులు అభినందనలు తెలిపారు.



పునీతను అభినందిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు పెద్దలు

రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- గృహసారథులతో సమావేశం

రాజోలు: రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా గృహసారథులు కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం తాటిపాకలో గ్రామశాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే రాపాక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారునికి అందుతున్నాయన్నారు. గృహసారథులుగా నియమితులైన వారికి పార్టీ సమకూర్చిన కిట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

మామిడికుదురు: సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో భాగంగా అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ వైకేడీ రమాదేవి శనివారం తెలిపారు. మామిడికుదురులో బీసీఏ, అప్పనపల్లి మొల్లేటివారిపాలెంలో ఓసీ ఈహెచ్, మొగలికుదురు మెయిన్ బీసీ బీల కేటగిరిలలో ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానికులు, వివాహిత మహిళలై ఉండాలని, వయస్సు 2022 జూలై 1 నాటికి 21 నుండి 35 ఏళ్ల లోపు ఉండాలని, పదో తరగతి పాసై ఉండాలన్నారు. దివ్యాంగులకు ప్రాధన్యత ఇస్తామని, ఈ నెల 31వ తేదీ నాటికి శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పి.గన్నవరం వారికి దరఖాస్తు పంపాలన్నారు.

కొత్తపేట: మండలంలో గంటి ఎస్సీ పెదపేట (ఎస్సీ), కొత్తపేట చిన్నగూళ్లపాలెం(బీసీ బీ), కొత్తపేట రామాలయం వీధి, ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి ఎస్‌బీ పేట (ఓసీ జనరల్) అభ్యర్థుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు సీడీపీఓ పి.శారద తెలిపారు.

రాజోలు: మండలంలోని బి.సావరం-2(బీసీ-ఏ), తాటిపాక మార్కెట్ ఏరియా(ఓసీ), సఖినేటిపల్లి మండలం మోరి పడమటిపాలెం(బీసీ-ఏ), సఖినేటిపల్లి కుమ్మరిగరువు(ఎస్సీ), సఖినేటిపల్లి రత్నాలపేట(ఎస్టీ), సఖినేటిపల్లి ఆనంద్‌నగర్(ఎస్సీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరినట్టు సీడీపీఓ రమాదేవి తెలిపారు.

పి.గన్నవరం: మండలంలోని చిరతపూడి విప్పర్తివారిపేట మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (బీసీ-ఏ) పోస్టును భర్తీ చేస్తున్నామని ప్రాజక్టు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.సత్యవేణి తెలిపారు. వాడ్రేవుపల్లి మెయిన్ (ఓసీ-జనరల్), మామిడికుదురు పంచాయతీ (బీసీ-ఏ), అప్పనపల్లి మొల్లేటివారిపాలెం (ఓసీ-ఈహెచ్), మొగలికుదురు మెయిన్ (బీసీ-బీ) కేంద్రాల్లో సహాయకురాలి పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

ఆలమూరు: మండలంలో మూడు పోస్టులు ఖాళీగా ఉండగా అందులో పెదపళ్ల-2లోని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును జనరల్ (హెచ్‌హెచ్) కేటగిరికి కేటాయించినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అధికారి గజలక్ష్మి తెలిపారు. చొప్పెల్ల-3 సహాయరాలు పోస్టును జనరల్‌కు, బడుగువానిలంక-2లో బీసీ-డీకి కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



యువకుడికి ఆర్థికసాయం అందిస్తున్న దాత ప్రభాకరరావు

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రాణాప్రాయ స్థితి నుంచి కోలుకున్న ఆలమూరుకు చెందిన రాపాక కిరణ్‌కుమార్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు బాధితుడి పరిస్థితి చూసి చలించి, ప్రమాదానికి కారణమైన వాహనదారులతో మాట్లాడి తగిన న్యాయం చేయాలన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌కు గ్రామ పెద్దల సమక్షంలో దాత ప్రభాకరరావు సమకూర్చిన ఆర్థికసాయం మొత్తాన్ని అందజేశారు.

కేశవస్వామి ఆలయానికి రూ.25 వేల విరాళం



జానికిరామ్‌కు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈవో కృష్ణ చైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయం అభివృద్ధి పనులకు బుల్లితెర నటుడు తోట జానికీరామ్ రూ.25 వేలు విరాళం అందించినట్టు ఈవో బి.కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం జానికీరామ్ స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలర్ధావరణలో నిర్వహించిన స్వామివారి మాస కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు ఆలయ ఈవో కృష్ణ చైతన్య స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్

అన్నదానానికి విరాళాలు

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్టు ఆలయ ఈవో ముదునూరి సత్యానారాయణరాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన జి.జెమినీప్రసాద్, శ్రీదేవి రూ.30 వేలు, అకివీడుకు చెందిన కె.లక్ష్మీపతిరాజు రూ.25,001 విరాళాలు అందించినట్టు తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

వివాహిత అదృశ్యం

అయినవిల్లి: వివాహిత అదృశ్యంపై అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం .. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన నాతి పుష్ప(19) ఈ నెల 6వ తేదీ రాత్రి 12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె భర్త నేతికొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అంబాజీపేటలో భారీ వర్షం

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా శనివారం రాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది.జన జీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఉరుములకు చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురయ్యారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో శనివారం సాయంత్రం జరిగే కొబ్బరి వ్యాపార లావాదేవీలకు ఆటంకం ఏర్పడింది. చిరు, తోపుడు బండి వ్యాపారులు, ప్రయాణికులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: మండలం పరిధిలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు ఎంఆర్, టీటీ, డీపీటీ, హైపటైటీస్ బీ టీకాలు వేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో ఆలమూరు-1, ఆలమూరు-2, పెనికేరు, పినపళ్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటిరేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, గుమ్మిలేరు గ్రామాల్లో చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పర్యవేక్షించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ఆత్రేయపురం: గ్రామానికి చెందిన కోలమూరి నాగదేవి తనను అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ వేధిస్తున్నారని శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే ఆమెకు చాగల్లు మండలం మోర్కొండపాడుకు చెందిన సతీష్‌కుమార్‌తో 2010లో వివాహమై, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఇటీవల భర్త సతీష్‌కుమార్‌తో పాటు అత్తమామలు అదనపు కట్నం తీసుకుని రావాలంటూ మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. దీనిపై బాధితురాలు నాగదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సీహెచ్ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలో ఉన్న అభినవ షిర్డీ సాయి మందిరం తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతుల జరగనున్నాయి. షిర్డీ లోని బాబా ఆలయన్ని గుర్తు చేసేలా ఈ ఆలయం నిర్మితమవడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తారు. ఉదయం 10.30 గంటలకు అమృత వర్షిణి సత్సంఘం, సాయి భక్తి గీతాలాపన, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.